ఆదివారం హైదరాబాద్‌లోని జలవిహార్‌లో బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల నియోజకవర్గ ఇన్‌చార్జీలు, సోషల్ మీడియా వారియర్ల సమావేశంలో దిశానిర్దేశం చేస్తున్న మంత్రులు కే తారకరామారావు, హరీశ్‌రావు

చతుర్ముఖ వ్యూహం.. చరిత్రను తిరగరాద్దాం

- విపక్షాల కుట్రలను ఎండగట్టాలి
- ఫేక్ న్యూస్‌ను బలంగా తిప్పికొట్టాలి
- ఇంటింటికీ మ్యానిఫెస్టో తీసుకెళ్లాలి
- తొమ్మిదేండ్ల ప్రగతిని వివరించాలి
- తిరుగులేని విజయం మన సొంతం
- బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జీలకు కేటీఆర్, హరీశ్‌రావు దిశానిర్దేశం

హైదరాబాద్, అక్టోబర్ 22 (నమస్తే తెలంగాణ): తొమ్మిదేండ్ల ప్రగతి, ఎన్నికల మ్యానిఫెస్టో, విపక్షాల ఆరోపణలు తిప్పికొట్టడం, పార్టీ శ్రేణుల అప్రమత్తం.. ఇలా చతుర్ముఖ వ్యూహంతో ముందుకు సాగాలని బీఆర్ఎస్ శ్రేణులకు మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు దిశానిర్దేశం చేశారు. చరిత్రను తిరగరాసి తిరుగులేని విజయాన్ని సొంతం చేసుకోబోతున్నామని ప్రకటించారు. ఆదివారం జలవిహార్‌లో బీఆర్ఎస్ ఎన్నికల నియోజకవర్గ ఇంచార్జిలు, సోషల్ మీడియా వారియర్లకు ఎన్నికల వేళ అనుసరించాల్సిన వ్యూహాలను వివరించారు. విపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు బీఆర్ఎస్‌వైపే ఉన్నారని, ప్రజల దృష్టిని మళ్లించేందుకు కాంగ్రెస్, బీజేపీ ఫేక్‌న్యూస్‌నే ఆయుధంగా మలచుకుంటాయని వాటిని ఎప్పటికప్పుడు బలంగా తిప్పికొట్టాలని తెలిపారు. పార్టీ మ్యానిఫెస్టోకు విశేష స్పందన వస్తున్నదని, దీన్ని ఇంటింటికీ చేర్చేవిధంగా కార్యాచరణ ఉండాలని వెల్లడించారు. తొమ్మిదిన్నరేండ్ల సీఎం కేసీఆర్ పాలన, కాంగ్రెస్ తెలంగాణకు దశాబ్దాలుగా చేసిన దగాను వివరించాలని సూచించారు.

సమన్వయంతో ముందుకు సాగాలి

ఎన్నికల ప్రవర్తనా నియమావళికి అనుగుణంగా అన్ని స్థాయిల్లో పార్టీ శ్రేణులను ఎప్పటికప్పుడు సమన్వయం చేయాల్సిన బాధ్యత ఇంచార్జిలపై ఉన్నదని మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు అన్నారు. ప్రతి నియోజకవర్గానికో వార్‌రూం ఏర్పాటు చేసుకోవాలని, ఇందులో నియోజకవర్గ ఇన్‌చార్జి, సోషల్ మీడియా వారియర్, నియోజకవర్గ స్వరూప స్వభావాలు తెలిసిన వ్యక్తి ఉండేలా చూసుకోవాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 35 వేల పోలింగ్ బూత్‌లు ఉన్నాయని, బూత్ వారీగా స్థితిగతులను ఎప్పటికప్పుడు నిశితంగా గమనించాలని, పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి అందే ప్రతి సూచన క్షణాల్లో అన్ని బూత్‌లకు వెళ్లేలా విస్తృత నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. రాష్ట్రంలో 12,769 గ్రామ పంచాయతీలు, 3,700 మున్సిపాలిటీల్లోని వార్డుల్లో బీఆర్ఎస్‌కు సుశిక్షితులైన పార్టీ కార్యకర్తలున్నారని వెల్లడించారు. ఇతర పార్టీలు ప్రజల్లో గందరగోళం సృష్టించేందుకు, అక్కడక్కడా రెచ్చిగొట్టి పబ్బం గడుపుకోవాలని చూస్తాయని, ఈ క్రమంలో భావోద్వేగాలకు ఆస్కారం లేకుండా శాంతి సామరస్యాలతో ఉండేలా గులాబీ సైన్యాన్ని సిద్ధం చేయాలని పిలుపునిచ్చారు.

సర్వేలన్నీ మనకే అనుకూలం

కాంగ్రెస్, బీజేపీ సహా బరిలో నిలిచే ప్రతి ఒక్కరూ బీఆర్ఎస్‌ను టార్గెట్ చేస్తాయని, ఆ పార్టీలు రాష్ట్రానికి, నియోజకవర్గానికి చేసిన మోసాలను ప్రజల ముందు ఉంచాలని కేటీఆర్, హరీశ్‌రావు సూచించారు. జాతీయ, రాష్ట్రస్థాయి సర్వేలు ఇప్పటి వరకు ఇచ్చిన ఫలితాలన్నీ రాష్ట్రంలో తిరిగి అధికారాన్ని చేపట్టేది బీఆర్ఎస్ పార్టీయేనని కుండబద్దలు కొడుతున్నాయని తెలిపారు. 'ప్రతి గులాబీ సైనికుడు బాధ్యతగా వ్యవహరించాలి. దేశంలోనే ఏ రాష్ట్రం కూడా ఊహించని పనులు చేశాం, విప్లవాత్మక పథకాలను తెచ్చి ప్రజల జీవితాలను మార్చాం. కాంగ్రెస్, బీజేపీ నాయకులకు ఈ విషయం తెలిసినా నాలుగు ఓట్ల కోసం లేనిపోని అసత్యాలను ప్రచారం చేస్తారు. అసత్యాన్ని సత్యవంతమైన సమాధానంతో తిప్పికొట్టాలి తప్ప ఘర్షణాత్మక వైఖరికి తావు ఇవ్వకూడదు' అని దిశానిర్దేశం చేశారు.

మీరే బ్రిగేడియర్లు

నియోజకవర్గానికి వార్‌రూం వారియర్లే బ్రిగేడియర్లుగా పనిచేయాలని మంత్రులు సూచించారు. సంక్షేమ పథకాల లబ్ధిదారులతో (స్కీముల వారీగా) టెలికాన్ఫరెన్స్ నిర్వహించాలని, ఆ సమయంలో అభ్యర్థులతో మాట్లాడించే ప్రయత్నం చేయాలని తెలిపారు. 2014 ఎన్నికలకు, ప్రస్తుత ఎన్నికలకు సోషల్ మీడియా విస్తృతి పెరిగిందని, బీఆర్ఎస్‌కు ఉన్న సానుకూలతలను వినియోగించుకొని గ్రామపంచాయతీకి కనీసం 500 మందితో సోషల్ మీడియా గ్రూప్‌ను ఏర్పాటు చేసి, ఆ గ్రూప్ ద్వారా ఎప్పకప్పుడు పార్టీ సందేశాన్ని తీసుకెళ్లాలని వివరించారు. సమావేశానికి బీఆర్ఎస్ లోక్‌పక్ష నేత నామా నాగేశ్వర్‌రావు, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ సహా నియోజకవర్గానికి నలుగురు చొప్పున హాజరయ్యారు.

కాంగ్రెస్‌తో పాఠాలు చెప్పించుకునే ఖర్మ మాకు లేదు: కేటీఆర్

కాంగ్రెస్‌తో సంస్కారం గురించి పాఠాలు చెప్పించుకోవాల్సిన ఖర్మ తమకు లేదని మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. రూ.50 కోట్లకు పీసీసీ అధ్యక్ష పదవిని అమ్ముకున్న కాంగ్రెస్ పార్టీయా తమకు చెప్పేది అని నిప్పులు చెరిగారు. నియోజకవర్గ ఇంచార్జిలు, వార్‌రూం వారియర్లతో సమావేశానంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ నేత జానారెడ్డి సంస్కారం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉన్నదని ఎద్దేవా చేశారు. సంస్కారం అంటే ఏమిటో ముందు పీసీసీ అధ్యక్షుడికి పాఠం చెప్పాలని సూచించారు. చావునోట్లో తలపెట్టి తెలంగాణ కోసం కొట్లాడి రాష్ట్రాన్ని సాధించి, అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలిపిన కేసీఆర్‌ను పట్టుకొని స్థాయిలేకుండా, సోయిలేకుండా మాట్లాడే రేవంత్‌కు జానారెడ్డి సంస్కారం నేర్పాలన్నారు. 'కేసీఆర్‌ను రాళ్లతో కొట్టి చంపండి' అని రేవంత్ అన్నప్పుడు జానారెడ్డి సంస్కారం ఎక్కడపోయిందని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఎన్ని సర్కస్ ఫీట్లు చేసినా, కాళ్లు మీద, తలకింద పెట్టినా ప్రజలు సీఎం కేసీఆర్ వైపే ఉన్నారని పేర్కొన్నారు.

మైనంపల్లి అరాచకాలను అడ్డుకుంటాం

- కాంగ్రెస్ ఓబీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి నక్క రాజశేఖర్

మల్కాజిగిరి, అక్టోబర్ 22: మల్కాజిగిరి నియోజకవర్గంలో మైనంపల్లి హనుమంతరావు అరాచకాలకు అడ్డుకుంటామని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి నక్క రాజశేఖర్ అన్నారు. ఆదివారం ఓల్డ్ అల్వాల్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. మైనంపల్లి అరాచకాలకు అడ్డుకట్ట వేసేందుకు బాధితులందరం సంఘటితం అవుతున్నామని చెప్పారు. పార్టీ నుంచి బయటకు వెళ్లిన వారిపైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టిస్తున్నారని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి నిర్ణయాల వల్ల కాంగ్రెస్‌కు తీవ్రనష్టం జరిగిందని ఆవేదన వ్యక్తంచేశారు. బీసీ నాయకుడు నందికంటి శ్రీధర్‌కు టికెట్ ఇవ్వకుండా మోసం చేశారని ధ్వజమెత్తారు. మల్కాజిగిరి బీఆర్ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డికి మద్దతుగా త్వరలో బీఆర్ఎస్‌లో చేరనున్నట్టు పేర్కొన్నారు. ప్రజాసంక్షేమం కోసం సీఎం కేసీఆర్ అమలు పరుస్తున్న పథకాల ఫలాలు అందుతున్నాయని స్పష్టంచేశారు. సమావేశంలో డోలి రమేశ్, నేమూరి శ్రీధర్ గౌడ్, అభిగౌడ్, శివగౌడ్, శ్రీనివాస్ గౌడ్, దేవవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సీపీఐకి ఏఐటీయూసీ షాక్

- చెన్నూర్‌లో పోటీ చేయొద్దని తీర్మానం

హైదరాబాద్, అక్టోబర్ 22 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్, వామపక్షాల మధ్య పొత్తులో భాగంగా చెన్నూర్ నియోజకవర్గాన్ని సీపీఐకి కేటాయిస్తారనే ప్రచారం జరుగుతున్నది. అయితే, చెన్నూర్‌లో పోటీ చేయవద్దని సీపీఐ అనుబంధ సంఘం ఏఐటీయూసీ తీర్మానం చేసింది. బలం లేని చోట పోటీ వద్దని పేర్కొన్నది. చెన్నూర్ టికెట్ ప్రతిపాదనను విరమించుకోవాలని మంద మర్రి కార్మిక సంఘం విభాగం కోరింది. దీంతో ఆదిలోనే సీపీఐకి ఉహించని షాక్ తగిలినట్టయ్యింది.

పాలేరు కోసం సీపీఎం పట్టు

- పొంగులేటికి ఢిల్లీ అధిష్ఠానం పిలుపు

హైదరాబాద్, అక్టోబర్ 22 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్, వామపక్షాల మధ్య రాజకీయ అవగాహన కుదిరినా, సీట్ల పంపకాలపై ఇంకా స్పష్టత రాలేదు. ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గం తమకే కేటాయించాలని సీపీఎం పట్టుబడుతున్నది. ఇప్పటికే కాంగ్రెస్ నుంచి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ఈ టికెట్ కోసం పోటీ పడుతున్నారు. పొంగులేటికి పాలేరు, తుమ్మలకు ఖమ్మం కేటాయిస్తారనే ప్రచారం జరుగుతున్నది. సీపీఎం కూడా పాలేరు కోసం పట్టుబడుతుండగా వైరా నియోజకవర్గం కేటాయిస్తామని కాంగ్రెస్ చెప్తున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో పొంగులేటిని పార్టీ అధిష్ఠానం ఢిల్లీకి పిలిపించడం ఆసక్తికరంగా మారింది.

బీసీలంటే ఓట్లేసే యంత్రాలేనా?

- కాంగ్రెస్‌లో ముదురుతున్న బీసీ లొల్లి
- బీసీ మీటింగ్ పెట్టనీయలే
- కాంగ్రెస్ నేత వీహెచ్ ఆరోపణ

హైదరాబాద్, అక్టోబర్ 22 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్‌లో బీసీ పంచాయితీ ముదురుతున్నది. కాంగ్రెస్‌లో బీసీ నేతలను చిన్నచూపు చూస్తున్నారని, అవమానిస్తున్నారని ఆ పార్టీ సీనియర్ నేత వీ హనుమంతరావు సంచలన ఆరోపణలు చేశారు. సూర్యాపేటలో బీసీ మీటింగ్ పెట్టడానికి ప్రయత్నిస్తే అడ్డుకున్నారని, బీసీ డిక్లరేషన్ కూడా చేయనీయలేదని మండిపడ్డారు. బీసీలంటే కేవలం ఓట్లేసే యంత్రాలేనా? అని ప్రశ్నించారు. ఆదివారం ఆయన అంబర్‌పేటలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్‌లో బీసీలకు వ్యతిరేకంగా ఎన్నో జరుగుతున్నాయని చెప్పారు. భువనగిరి, ఆలేరు సీట్లను బీసీలకు కేటాయిస్తానని చెప్పి మోసం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అంబర్‌పేట టికెట్‌ను గత ఎన్నికల్లో లక్ష్మణ్‌యాదవ్‌కు ఇప్పించానని, నామినేషన్ వేసిన తర్వాత కోదండరాం మేనేజ్ చేయడంతో బీసీ అభ్యర్థితో విత్‌డ్రా చేయించారని చెప్పారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తనను అవమానిస్తున్నారని మండిపడ్డారు. తనపై అక్రమ కేసులు పెట్టిన నూతి శ్రీకాంత్ గౌడ్‌కు టికెట్ ఇప్పించేందుకు ప్రయత్నిస్తున్నాడని ఆరోపించారు. కాంగ్రెస్‌లో పాత నేతలందరినీ వెళ్లగొట్టేందుకు కుట్రలు జరుగుతున్నాయని చెప్పారు. తనపై కుట్ర చేస్తే ఉత్తమ్ చేసినవన్నీ బయటపెడుతానని హెచ్చరించారు.

బరి నుంచి కిషన్‌రెడ్డి పరారీ!

- తొలి జాబితాలో కనిపించని పేరు
- అభ్యర్థులు లేక బరిలోకి బీజేపీ ఎంపీలు
- పోలింగ్ దగ్గరికొస్తున్నా ఎదురుచూపులే
- టికెట్ల కేటాయింపుపై అసంతృప్తి సెగలు

హైదరాబాద్, అక్టోబర్ 22 (నమస్తే తెలంగాణ): బీజేపీ ఆదివారం విడుదల చేసిన మొదటి జాబితాను చూసి పార్టీ శ్రేణులే నిరుత్సాహానికి గురయ్యాయి. ముందుండి నడిపించాల్సిన అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పేరే లేకపోవడంతో 'ఎందుకు?' అని పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్నది. అంబర్‌పేట నుంచి ఆయన పోటీ చేస్తారని భావించినా.. కొన్ని రోజులుగా తన భార్యకు టికెట్ అడుగుతున్నారని ప్రచారం జరుగుతున్నది. తాను బరిలోకి దిగి ఓడిపోతే పరువు పోతుందని కిషన్‌రెడ్డి భావిస్తున్నట్టు సమాచారం. భార్య ఓడిపోయినా తాను రాష్ట్రవ్యాప్త ప్రచారంలో ఉండటం వల్ల ఇలా జరిగిందని చెప్పుకొనేందుకు అవకాశం ఉంటుందని అంటున్నారట. బీజేపీకి అభ్యర్థులు లేరని మొదటి నుంచీ ఉన్న ప్రచారం నిజమేనని తొలి జాబితాతోనే స్పష్టమైందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. అభ్యర్థులు లేకపోవడం వల్లే రాష్ట్రంలో ఉన్న ఎంపీలందరికీ టికెట్లు ఇచ్చి పోటీ చేయిస్తున్నారని ఎద్దేవా చేస్తున్నారు. పోలింగ్ తేదీకి మరో 40 రోజుల సమయం కూడా లేదు. 119 మంది అభ్యర్థులను ప్రకటించడం పక్కన పెడితే, కనీసం ఎన్ని స్థానాల్లో పోటీ చేస్తుందో చెప్పే పరిస్థితిలో కూడా బీజేపీ లేదు. అభ్యర్థులు లేక పొత్తుల కోసం తహతహలాడుతున్నది. తెలంగాణలో ఉనికిలో లేని జనసేనతో పొత్తు పెట్టుకోవడమే ఇందుకు నిదర్శనమని విశ్లేషిస్తున్నారు. ఇంకొన్ని చిన్నా చితకా పార్టీలతోనూ చర్చలు జరుపుతున్నారని, ఆ తర్వాతే మిగిలిన స్థానాలపై స్పష్టత వస్తుందని పార్టీ నేతలు చెప్తున్నారు.

వాడుకొని వదిలేశారు!

కొందరు నేతలు తమకు టికెట్లు కేటాయించకపోవడంపై అసంతృప్తితో ఉన్నట్టు సమాచారం. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై బీజేపీ బహిష్కరణ వేటువేసిన సంగతి తెలిసిందే. శనివారం వరకు ఆయనపై ఉన్న సస్పెన్షన్‌ను ఎత్తివేయలేదు. ఆ సీటును విక్రమ్ గౌడ్‌కు కేటాయిస్తారని వార్తలు వచ్చాయి. ఈ మేరకు విక్రమ్ గౌడ్ స్థానికంగా ప్రచారం కూడా ప్రారంభించారు. కానీ, అకస్మాత్తుగా ఆదివారం సస్పెన్షన్ ఎత్తివేసి, వెంటనే టికెట్ కేటాయించారు. దీంతో విక్రమ్ గౌడ్ మనస్తాపం చెందినట్టు సమాచారం. టికెట్ కేటాయించాలన్న నిర్ణయం ఎప్పుడో జరిగిపోయిందని, అలాంటప్పుడు తనను ఎందుకు నమ్మించి మోసం చేశారని సన్నిహితుల దగ్గర వాపోతున్నారట. అలాగే అనుగుల రాకేశ్‌రెడ్డి మొదటి నుంచీ వరంగల్ వెస్ట్ టికెట్‌ను ఆశిస్తున్నారు. ఆయనకు టికెట్ దాదాపు ఖరారైనట్టేనని సంకేతాలు కూడా వెళ్లాయి. అనూహ్యంగా రావు పద్మకు టికెట్ కేటాయించారు. కల్వకుర్తిలో తళ్లోజు ఆచారికి టికెట్ కేటాయించారు. వాస్తవానికి అక్కడ మరోనేత వరుణ్ వందే కూడా మొదటి నుంచీ పోటీలో ఉన్నారు. ఈసారి యువనేతకు టికెట్ ఇస్తారని ప్రచారం సాగింది. అయితే, కేవలం సామాజిక వర్గాన్ని దృష్టిలో పెట్టుకొని ఆచారికి పదే పదే అవకాశాలు ఇస్తున్నారని స్థానిక నేతలు చర్చించుకుంటున్నారు. మానకొండూరులో ఇన్నాళ్లుగా బీజేపీకి గడ్డం నాగరాజు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. నిన్న గాక మొన్న చేరిన ఆరెపల్లి మోహన్‌కు టికెట్ ఇవ్వడంతో ఆయనా అలిగినట్టు తెలిసింది.

మంత్రి కేటీఆర్ సమక్షంలో చేతులు కలుపుతున్న కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్, కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు తదితరులు

బొల్లం మల్లయ్యనే గెలిపిస్తాం

- పార్టీ అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి ఉంటాం
- బీఆర్ఎస్ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి శశిధర్‌రెడ్డి, కోదాడ మున్సిపల్ చైర్‌పర్సన్ శిరీషాలక్ష్మీనారాయణ
- పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో భేటీ అనంతరం వెల్లడి

సూర్యాపేట, అక్టోబర్ 22 (నమస్తే తెలంగాణ): గతంలో బీఆర్ఎస్ కోదాడ నియోజకవర్గ ఇన్‌చార్జిగా పనిచేసిన తాను ఎమ్మెల్యే టికెట్ ఆశించానని, అయితే పార్టీ అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి ఎమ్మెల్యే అభ్యర్థి బొల్లం మల్లయ్యయాదవ్ గెలుపునకు కృషి చేస్తానని కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ సమక్షంలో కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్, నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డి సమావేశమయ్యారు. చిన్నపాటి వ్యక్తిగత భేదాభిప్రాయాలను పక్కన పెట్టి కోదాడలో బీఆర్ఎస్ గెలుపు కోసం కృషి చేయాలని మంత్రి కేటీఆర్ సూచించడంతో అసమ్మతి నాయకులు అంగీకరించారు. అనంతరం కోదాడ మున్సిపల్ చైర్‌పర్సన్ వనపర్తి శిరీషాలక్ష్మీనారాయణతో కలిసి శశిధర్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో ఐదు దశాబ్దాలపాటు జరగని అభివృద్ధి బీఆర్ఎస్ సర్కార్ తొమ్మిదిన్నరేండ్లలోనే జరిగిందని తెలిపారు. అలాంటి పార్టీ విచ్ఛిన్నానికి తాము సిద్ధంగా లేమని తేల్చిచెప్పారు. బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేస్తామని వారు ప్రకటించారు.

కారు కోసం ముక్తకంఠం

కోనప్పకు నామినేషన్ ఖర్చుల అందజేత

కౌటాల, అక్టోబర్ 22: కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం శీర్నా గ్రామంలో ఆదివారం బీఆర్ఎస్ కార్యకర్తలు నామినేషన్ ఖర్చుల కోసం బీఆర్ఎస్ అభ్యర్థి కోనేరు కోనప్పకు రూ.5,500 అందజేసి అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సారి కోనప్పను భారీ మెజార్టీతో గెలిపించుకునేలా పనిచేస్తామని వారు ప్రకటించారు.

బాజిరెడ్డికి వడ్డెరుల మద్దతు

ఇందల్వాయి, అక్టోబర్ 22: నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలంలోని గౌరారం గ్రామ పరిధిలోని వడ్డెర సంఘం సభ్యులు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతు తెలుపుతూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని వర్గాల అభ్యున్నతికి పాటుపడుతున్న ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను మరోసారి భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని ప్రకటించారు.

శ్రీనివాస్‌గౌడ్‌కే ఓటేస్తామని ప్రతిజ్ఞ చేస్తున్న మహబూబ్‌నగర్‌లోని కేటీఆర్ నగర్ కాలనీ వాసులు

'మా కాలనీలో వేరే పార్టీకి చోటులేదు

- శ్రీనివాస్‌గౌడ్‌ను గెలిపించుకుంటాం
- కేటీఆర్‌నగర్ కాలనీ వాసుల ప్రతిజ్ఞ

మహబూబ్‌నగర్‌టౌన్, అక్టోబర్ 22 : 'మా కాలనీలో ఇతర పార్టీలకు చోటు లేదు. కారు గుర్తుకు ఓటేసి మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపించుకుంటాం' అని మహబూబ్‌నగర్‌లోని కేటీఆర్ నగర్ కాలనీ వాసులు తీర్మానం చేశారు. ఊహించని విధంగా మహబూబ్‌నగర్‌ను అభివృద్ధి చేసిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను మరోసారి గెలిపించుకుంటామని, ఈ సారి లక్ష ఓట్లకుపైగా మెజార్టీ అందిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఇతర పార్టీల నాయకులు తమ కాలనీకి రావొద్దని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు శివరాజు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాములు, డబుల్ బెడ్రూం కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ సభలకు జనం కరువు

- రోడ్‌షోలతో కాంగ్రెస్ అగ్రనేత సరి
- 60 ఏండ్లలో కాంగ్రెస్ చేసిందేమీ లేదు
- పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ఓ బ్రోకర్.. ఛీటర్
- మీడియాతో మంత్రి ఎర్రబెల్లి దయాకర్



సీఎం సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రులు ఎర్రబెల్లి, సత్యవతి, ఎమ్మెల్యే శంకర్‌నాయక్ తదితరులు

మహబూబాబాద్/హనుమకొండ, అక్టోబర్ 22 (నమస్తే తెలంగాణ): రాహుల్ గాంధీ సభలకు ప్రజలు వస్తలేరని, అందుకే రోడ్‌షోలతో నెట్టుకొస్తున్నాడని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఎద్దేవా చేశారు. 60 ఏండ్లు అధికారమిస్తే ఏం అభివృద్ధి చేశారని, మరో చాన్స్ ఇవ్వాలని కాంగ్రెసోళ్లు అడుగుతున్నారని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీపై ప్రజలకు పూర్తిగా నమ్మకం పోయిందని అన్నారు. ఈనెల 27న మహబూబాబాద్, వర్ధన్నపేట నియోజకవర్గాల్లో సీఎం కేసీఆర్ ఆశీర్వాద సభల నేపథ్యంలో ఆదివారం ఆయన మహబూబాబాద్ పట్టణంలోని శనిగపురం శివారులో సభా స్థలాన్ని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, మహబూబాబాద్ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, జడ్పీ చైర్‌పర్సన్ అంగోతు బిందుతో కలిసి పరిశీలించారు. హెలిప్యాడ్, సభా స్థలి ప్రాంగణంలో చేపట్టే పనులపై నాయకులకు పలు సూచనలు చేశారు. అనంతరం వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని భట్టుపల్లిలో సీఎం కేసీఆర్ బహిరంగ సభ ఏర్పాట్లను ఎమ్మెల్యే అరూరి రమేశ్, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావుతో కలిసి మంత్రి ఎర్రబెల్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రజలకు మళ్లీ కష్టాలు తప్పవని హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి ఓ దొంగ, బ్రోకర్, చీటర్ అని, ఆయన అన్ని పార్టీలను సర్వనాశనం చేశాడని, ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీ సర్వనాశనమేనని ఆరోపించారు. తెలంగాణలోని పథకాలను కాపీకొట్టినా కర్ణాటకలోఅమలు చేయలేక పోతున్నారని దుయ్యబట్టారు. కేంద్రం ఎన్ని అవరోధాలు సృష్టించినా, సీఎం కేసీఆర్ రాష్ట్ర ప్రగతిని ఆపకుండా ముందుకు పరిగెత్తించారని కొనియాడారు. ఈనెల 27న మధ్యాహ్నం రెండు గంటలకు మానుకోటలో నిర్వహించే భారీ బహిరంగ సభకు బీఆర్ఎస్ కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

కేసీఆర్ వల్లే మానుకోట అభివృద్ధి..

మానుకోట జిల్లాను అభివృద్ధి చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని మంత్రి సత్యవతి రాథోడ్ కొనియాడారు. కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిగా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులను ఢిల్లీ నాయకులే డిసైడ్ చేయాల్సిన దౌర్భాగ్య పరిస్థితిలో ఉన్నారని ఎద్దేవా చేశారు. మానుకోట రాళ్లకు ఉన్న పౌరుషం కూడా కాంగ్రెస్, బీజేపీ నాయకులకు లేదని విమర్శించారు.

కరీంనగర్ జిల్లా చొప్పదండిలో ట్రస్మా ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె

ఎమ్మెల్యే సుంకెకు జైకొట్టిన 'ట్రస్మా'

చొప్పదండి, అక్టోబర్ 22 : చొప్పదండి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌కు ట్రస్మా సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఆదివారం చొప్పదండి పట్టణంలో ట్రస్మా ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌తో ట్రస్మా నాయకులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు మాట్లాడుతూ.. చొప్పదండి నుంచి ఎమ్మెల్యేగా రవిశంకర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. గతంలో ఆయన పాఠశాల కరస్పాండెంట్‌గా సేవలను అందించారని, అదే స్ఫూర్తితో గత ఎన్నికల్లో గెలిపించుకున్నామని గుర్తుచేశారు. ఈసారి కూడా భారీ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత ట్రస్మా సభ్యులపై ఉన్నదన్నారు.